# Eenadu

## తెలుగు రాష్ట్రాల్లో ఉద్యోగాల భర్తీ చేపట్టాలి

### బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** తెలంగాణలో 2 లక్షల ఉద్యోగాలు, ఆంధ్రప్రదేశ్‌లో 1.45 లక్షల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ ఐకాస ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద వందలాది మంది నిరుద్యోగులు ధర్నా నిర్వహించారు. ఐకాస ఛైర్మన్ నీల వెంకటేశ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, శాసనసభ్యుడు ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. అధికారంలోకి వచ్చి 27 నెలలు గడుస్తున్నా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల భర్తీ ఊసే ఎత్తడం లేదని ఎద్దేవా చేశారు.

**గ్రూప్స్ పరీక్షల్లో మల్టిపుల్ విధానాలు వద్దు:** ఏపీపీఎస్సీ గ్రూప్స్ పరీక్షల్లో మల్టిపుల్ పేపర్స్, సెషన్స్ విధానాన్ని రద్దు చేయాలని లేని పక్షంలో ఆందోళనలు ఉద్ధృతం చేసి చలో అమరావతి చేపడుతామని ఆర్.కృష్ణయ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిరుద్యోగుల ఐకాస ఆధ్వర్యంలో మంగళవారం నాంపల్లిలోని ఏపీపీఎస్సీ కార్యాలయాన్ని నిరుద్యోగులు ముట్టడించారు. ఈ ధర్నాలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. గ్రూప్స్ పరీక్షలను పాత పద్ధతిలోనే నిర్వహించాలన్నారు. అనంతరం ఏపీపీఎస్సీ ఛైర్మన్‌ను కలిసి ఆయా డిమాండ్ల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరినట్లు ఆయన తెలిపారు.



**ఏపీపీఎస్సీ కార్యాలయం ఎదుట ధర్నాలో ఆర్.కృష్ణయ్య తదితరులు**